క్లుప్తంగా

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామ పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగోల్ల వెంకట కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

గంగానమ్మ ఆలయంలో హోమం



భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న దృశ్యం

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో శ్రీ గంగానమ్మవార్ల జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం గణాచార్యులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి, బుజ్జి దంపతులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు, ఇతర గ్రామాలను వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం హోమం చేసి, భక్తులకు అమ్మవారి పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నామవరం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో హాలవతు పద్మపై పరారీ కేసు నమోదు చేసి 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన పరారీలో ఉన్న బోడా రాములును అదుపులోకి తీసుకొని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే కామవరపుకోట మండలం, ఆడమిల్లి గ్రామానికి చెందిన పాత నాటు సారాయి కేసులలో నిందితులైన జజ్జవరపు మరియదాసు, ఆడమిల్లి అర్జునరావులను కామవరపుకోట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ ఏర్పాటుకు వినతి



అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

కొయ్యలగూడెం: ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని రింగ్ రోడ్డు గ్రామాల యువత మంగళవారం జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. జంగారెడ్డిగూడెం డిపో నుంచి నర్సన్నపాలెం, రామాంజుపురం, ధర్మారావుపేట, కన్నాపురం టూ పోలవరం డిపో వరకు బస్సు సర్వీసుకు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్నామని అయితే పరిష్కారం కావడం లేదన్నారు. దీని వలన సుమారు 10 గ్రామాల ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు. మద్దు తేజ, బాలంనరేష్, వెంకట్, బాల రామరాజు, సింహాద్రి రాజు, రామారావు పాల్గొన్నారు.

హెచ్ఎం రాము సేవలు మరువలేనివి

దెందులూరు: హెచ్ఎంగా విధులు నిర్వహించిన తుంగ రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీవీ రమణ మూర్తి, జరజాపు రంగారావు లయన్స్ క్లబ్ జిల్లా డైరెక్టర్ చొక్కా అవినాష్ రాజు అన్నారు. బుధవారం సానిగూడెంలో వారు మాట్లాడుతూ హెచ్ఎం రాము ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారధిగా గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి కమిటీ గౌరవ అధ్యక్షునిగా గాలాయగూడెం కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎనలేని సేవలు అందజేశారన్నారు.

బరువు కాదు.. బాధ్యత

- శిరస్త్రాణం.. శిరసా నమామి
- హైకోర్టు ఆదేశాలతో కదిలిన పోలీసులు
- హెల్మెట్ ఆవశ్యకతపై స్పెషల్ డ్రైవ్



హెల్మెట్ పెట్టుకోనివారికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఏలూరు / దెందులూరు: సమాజంలో జీవిస్తున్నప్పుడు భయంతో పాటు బాధ్యత కూడా ఉండాలని ఓ రచయిత అన్నారు. ఎందుకంటే ద్విచక్రవాహనాన్ని నడపడటంలో వీరులమని, హెల్మెట్ అవసరం లేదని కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. మరికొందరు శిరస్త్రాణాన్ని బరువుగా భావిస్తుంటారు. ఈ ఆలోచనే ప్రాణా మీదకు తెలుస్తోంది. హెల్మెట్ తప్పకుండా ధరించాల్సిందే అని హైకోర్టు ఆదేశాలతో శిరస్త్రాణం భారం కాదు.. బాధ్యత అని పోలీసులు వాహన చోదకులకు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సత్వరమే జరిమానాలు విధించాలి, తనిఖీలు పెంచి కఠిన చర్యలు తప్పవనే సందేశం పంపాలి. రహదారులపై ముమ్మరంగా తనిఖీలు చేసి, నిబంధనలు పాటించనివారికి అక్కడిక్కడే జరిమానాలు విధించాలి. అప్పుడే వాహనచోదకుల్లో భయం వస్తుందని హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో పోలీసుల్లో చలనం వచ్చింది. ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేస్తూ హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తున్నారు. పాత చలానాలు కట్టిస్తున్నారు.

ప్రమాద ఘటనలు అధికం

వాహనంతో రోడ్డెక్కితే భద్రంగా తిరిగి వస్తామనే నమ్మకం లేకుండా పోయింది. ర్యాష్ డ్రైవింగ్ సిగ్నల్స్‌ను జంప్ చేస్తూ అడ్డదిడ్డంగా అతివేగంగా వాహన చోదకులు వెళ్తున్నారు. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించడం, పాత జరిమానాలు కట్టించే దిశగా చర్యలు తీసుకుపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. రోడ్లపై ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకే ఎక్కువ మంది మరణించిన ఘటనలు ఉన్నాయి. వాహనాల తనిఖీని సీసీ కెమెరాల్లో చూసి జరిమానాలను విధించడంతో ఎక్కువ మంది చలానాలు కట్టడం లేదు. వాహనచోదకుల్లో భయం లేకుండా పోయింది.

వీటికి అడ్డుకట్ట వేయాల్సిందే

యువత హెల్మెట్ ధరించకుండా స్పోర్ట్స్ బైకులపై, అతి వేగంగా వెళ్తున్నారు. రాత్రి వేళల్లో వీరికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ర్యాష్ డ్రైవింగ్, ప్రమాదకర విన్యాసాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహన తనిఖీలను ఉధృతం చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మోటారు వాహన నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వాహన తనిఖీలను ముమ్మరం చేయాలి.

> **హెల్మెట్ ధరించాలి**
>
> 
>
> రహదారి భద్రత – మనందరి బాధ్యత. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తాం. పాత చలానాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్ ధారణపైనా వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ తగ్గించేందుకు వీలుగా ఏలూరు, తణుకు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నాం.
>
> – ఆర్ శివాజీ, ఎస్సై, దెందులూరు

టైలరింగ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): పీఎం ఏజేఏవై స్కీమ్ (పీఎం – ఏజేఏవై) నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సౌజన్యంతో స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా ఇచ్చే టైలరింగ్ కోర్సుల్లో శిక్షణకు ఏలూరు జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ కోర్సుల్లో జంగారెడ్డిగూడెంలో రెండు నెలల శిక్షణ ఉంటుందని, పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నెంబర్లు 93812 73099, 94940 97819, 96667 71746, 91107 21092, 85007 13174, 9182 342688లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 45 మంది హాజరు

ఏలూరు (టూటౌన్): డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 46 మందికి 45 మంది హాజరైనట్టు డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 92 మందికి 89 మంది విద్యార్థులు హాజరైనట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

మేడేను ఘనంగా నిర్వహిద్దాం



మేడే కార్యక్రమాల వాల్ పోస్టర్ విడుదల చేసిన సీఐటీయూ శ్రేణులు



మేడే వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మికుల రక్తతర్పణంతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మార్పు చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.రాజు, ఎం నాగమణి, బి.సోమయ్య, వీవీఎస్ ప్రసాద్, కె.పోసమ్మ, ఎన్ రమణరావు, ఆర్‌వీఎస్ నారాయణ, వై.సాయి కిరణ్, కె.విజయలక్ష్మి, లోకేశ్వరి, తులసి, ఎస్ రాంబాబు, కేవీకేఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోరాడే ప్రజలపై ఉక్కుపాదం

ప్రజా సమస్యలపై పోరాడే ప్రజలపై పాలకులు ఉక్కు పాదం మోపుతున్నారని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వీవీ నగర్ మార్కెట్ యార్డ్ ఏరియాలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ వద్ద ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ముద్రించిన 139వ మేడే వాల్ పోస్టర్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చిన కార్మిక హక్కులు హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఇఫ్టూ నాయకులు యర్రా శ్రీనివాసరావు, మీసాల రమణ, మంగరాజు రాము, కోరాడ అప్పారావు, గడసాల రమణ, ధనస్ విజయ్, నకిరెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఏలూరు (టూటౌన్): మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికవాడల్లో నిర్వహించే జెండా ఆవిష్కరణ, సభలు క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆర్‌ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి అప్పలరాజు, ఏఐటీయూసీ నాయకులు పల్లెం కిషోర్‌లు మాట్లాడారు. ఈనెల 26న స్ఫూర్తి భవన్‌లో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు , నాయకులు బి జగన్నాథరావు ,యర్రా వెంకటేశ్వర్లు, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించాలి



డీఆర్ఓ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో): గ్రేడ్-1 వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలని వీఆర్ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. మంగళవారం ఏలూరు జిల్లా డీఆర్ఓ విశ్వేశ్వరరావును వీఆర్వోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీఆర్వోల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-1 వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడంతో పాటు, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్ఓలుగా ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. దీనిపై డీఆర్ఓ సానుకూలంగా స్పందించినట్టు రవీంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షులు శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), జిల్లా నాయకులు అజయ్ పాల్గొన్నారు.

క్షేత్రంలో రోడ్డు విస్తరణకు మళ్లీ మార్కింగ్



రహదారి విస్తరణకు మార్కింగ్ ఇస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ప్రధాన రహదారి విస్తరణకు ఆర్అండ్‌బీ, పంచాయితీ అధికారులు మంగళవారం మళ్లీ మార్కింగ్ ఇచ్చారు. అయితే గతంలో ఇచ్చిన మార్కింగ్‌లకు భిన్నంగా ప్రస్తుతం ఇచ్చిన మార్కింగ్‌లు ఉన్నాయని గృహ యజమానులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. భీమడోలు–ద్వారకాతిరుమల ప్రధాన రహదారిని గోదావరి పుష్కర నిధులు రూ.50 కోట్లతో నాలుగు లైన్లుగా పదేళ్ల క్రితం విస్తరించారు. స్థానిక గుడి సెంటర్‌లో మినహా మిగిలిన ప్రాంతాల్లో ఈ పనులు అప్పట్లోనే పూర్తయ్యాయి. అయితే గుడి సెంటర్ విస్తరణకు సంబంధించి హైకోర్టులో ఉన్న స్టేలు ఇటీవల తొలగిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటివరకు పలుమార్లు రహదారి విస్తరణకు అధికారులు మార్కింగ్‌లు ఇచ్చారు. అయితే తాజాగా మంగళవారం ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారుల సమక్షంలో నిర్వహించిన మార్కింగ్ పనులు బాధిత గృహ యజమానులను గందరగోళానికి గురి చేశాయి. పాత మార్కింగ్‌లకు భిన్నంగా కొత్త మార్కింగ్‌లు ఉన్నాయంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం: సీనియర్ సిటిజన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ కోరారు. మంగళవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్లు నిండిన పురుషులు, 58 సంవత్సరాలు నిండిన మహిళలు సీనియర్ సిటిజన్ కార్డులకు అర్హులన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు పాస్ పోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూపు వివరాలు అందించడంతో పాటు, దరఖాస్తు రుసుం రూ.40 చెల్లించాలన్నారు. సచివాలయ డేటా సెక్రటరీ వివరాలను ఆన్‌లైన్ చేస్తారని, ఐదు రోజుల తరువాత కార్డు మంజూరు అవుతుందన్నారు. సీనియర్ సిటిజన్ కార్డు ఉండటం వల్ల ప్రతిసారీ ఆధార్ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ మీ సొంతమవుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మమేకమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇష్టపడి చదివి విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుని లక్ష్యాల ను సాధించగలరన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ఉన్నత విద్యతో పాటు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో బాధ్యతలు ఉండవని మీ బాధ్యతలను మీ తల్లిదండ్రులు మోస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కష్టపడతారన్నారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులను, మరుగుదొడ్లను, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.బాబూరావు, ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు, హెచ్ఎం ఇరపా గంగాదేవి, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏ కుటుంబానికి న్యాయం చేయాలి



విజయ కుమారి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): వెలుగు వీవోఏ శ్రీకాకుళం విజయ కుమారి కుటుంబానికి న్యాయం చేయాలని వీవోఏల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే సుభాషిని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 15న అనారోగ్య కారణంగా లింగపాలెం మండలం సింగిగూడెం గ్రామంలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న విజయ కుమారి మరణించడంతో, ఆమె కుటుంబాన్ని సుభాషిణి మంగళవారం పరామర్శించారు. ఆమె మరణానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 11 మంది వీవోఏలను అక్రమంగా తొలగించారని, వీరిలో విజయకుమారి ఒకరని తెలిపారు. 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న విజయకుమారిని కూటమి ప్రభుత్వం తొలగించిందన్నారు. లింగపాలెం ఏపీఎం జ్యోతి వెంకాయమ్మ, సీసీ మార్గదర్శి బాగా ఒత్తిడికి గురి చేయడంతో విజయకుమారి మానసికంగా కృంగిపోయి అనారోగ్యానికి గురై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారని తెలిపారు. అధికారులు స్పందించి మిగిలిన 10 మంది వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని, విజయకుమారి కుటుంబంలో ఒకరికి వీవోఏగా స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

హారన్ కొట్టొద్దన్నాడని దాడి

ఏలూరు టౌన్: ఏలూరు ఆదివారపుపేటలోని ఒక షాపు వద్ద ఎదురుగా రోడ్డుపై ఉన్న వ్యాన్ డ్రైవర్ హారన్ కొడుతూ ఉండటంతో హారన్ కొట్టవద్దని షాపు యజమాని చెప్పడంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్ రాడ్డుతో షాపు యజమానిపై దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు నవాబు కాలనీకి చెందిన నూతుపల్లి సాయిదుర్గా ప్రసాద్ ఏలూరు ఆదివారపుపేట సాయిబాబా గుడి వద్ద మహాలక్ష్మి ఎలక్ట్రానిక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. చాటపర్రు ప్రాంతానికి చెందిన జిజ్జువరపు సాయి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం షాపు వద్ద రోడ్డుపై వ్యాన్ ఆపి హారన్ కొడుతున్నాడు. దుర్గాప్రసాద్ ఎందుకు హారన్ వేస్తున్నావంటూ సాయిని అడిగాడు. అనంతరం డ్రైవర్ సాయి షాపు యజమానిపై ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మీనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ క్యాథలిక అధినేత పోప్ ఫ్రాన్సిస్‌కు స్థానిక ఎస్ఆర్‌పేటలోని వైకే గ్రాఫిక్స్ కార్యాలయంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ప్రజల హృదయాలలో కరుణ, దయ, వినయం ఆధ్యాత్మిక ధైర్యంకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కోసం ఎన్నో సేవలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తోట డేవిడ్ రాజు, మానవత సంస్థ చైర్మన్ ఎం అజయ్ బాబు పాల్గొన్నారు.

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం



విద్యుద్దీపాలంకరణలో శ్రీనివాసుని ఆలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఆవరణలో శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక అలంకారాలు చేసి, హారతులిచ్చారు.

నేడు శ్రీనివాసుని కల్యాణం

శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. అందులో భాగంగా కల్యాణ మండప ప్రాంతాన్ని విద్యుద్దీపాలు, పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటి బోదెలతో అలంకరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	27
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీనివాసుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఆరాధన, తోమాల సేవ, బాలభోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జంగారెడ్డిగూడేనికి చెందిన శ్రీకాళహస్తి నిరంజన్‌కుమార్ కుటుంబం, కొయ్యలగూడేనికి చెందిన శ్రీనివాస్, దుర్గాదేవి దంపతులు, ఉభయధారులుగా వ్యవహరించారు. అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, కుమారాచార్యులు, రాఘవాచార్యులు నూతన పట్టు వస్త్రాలు, యజ్ఞోపవేతం, మాంగల్య ధారణ, ముత్యాల తలంబ్రాలతో ఈ కల్యాణోత్సం నిర్వహించారని ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

టి.నరసాపురం: మండలంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గుడెల్లి వెంకటరావు మాట్లాడతూ మండలంలో ఉపాధి కూలీలకు తొమ్మిది వారాలుగా డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ తీరును విమర్శించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, కార్మిక సంఘం నాయకులు మడకం కుమారి, ముత్యాలమ్మ, గీత, వేమన, చెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

దెందులూరు: వేసవిలో ఏ ఒక్క గ్రామంలోనూ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి, తహసీల్దార్ డి.సుమతి కోరారు. మంగళవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు అధ్యక్షతన దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని శాఖ అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ డివిజనల్ ఇంజినీర్లు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవటమే కాకుండా ఉన్న మంచినీటి చెరువులు పూర్తి రక్షణ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు శాఖాపరమైన ప్రగతిని వివరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పరిషత్ కార్యాలయ ఏవో భీమరాజు తదితరులు ఉన్నారు.

బ్యాగ్‌ల పంపిణీ

దెందులూరు: మండలంలోని సీతంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీలు, ఆయాలకు బ్యాగ్‌లను యాంటినో రీ సోషల్ సర్వీస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ తోట ఎడ్వర్డ్ అందజేశారు. 25 ఏళ్లుగా జిల్లాలో గిరిజన ప్రాంతాలు, కొల్లేరు ప్రాంతాలు, మెట్ట ప్రాంతాల్లో విద్య, వైద్య, ఆధ్యాత్మిక, మౌలిక వసతులు కల్పన రంగాల్లో సేవలందిస్తున్న ఎడ్వర్డ్‌ను పలువురు అభినందించారు